క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి పనులు



ఉప్పర్లపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

తుగ్గలి : మండలంలో ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తీవ్ర వర్షా భావం దృష్ట్యా ఉపాధి అధికారులు ఈసారి ముందస్తుగానే పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. గురువారం మండల వ్యాప్తంగా 3,855 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నట్లు ఏపీఓ రామకృష్ణ తెలిపారు. అడిగిన వారందరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, కూలీలు ఎవరూ వలసలు వెళ్లొద్దని కోరారు. గ్రామాల్లో అవగాహన కల్పించి కూలీలందరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

నేటినుంచి సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ఉత్సవాలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు కట్ట మీద వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు 17 నుంచి 19 వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ గురువారం తెలిపారు. 17వతేదీ ఉదయం గణపతిపూజ, సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 18 వతేదీ ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం సాయంత్రం ప్రభోత్సవ ఊరేగింపు ఉంటుందని, 19న స్వామి వారికి అష్టోత్తర నామార్చన, రాత్రి తెనాలి నటులచే ఆణిముత్యములు నాటక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

వేలంపాటల్లో పెరిగిన ఆదాయం



వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలిలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఏడాది పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు గురువారం దేవాదాయ శాఖాధికారుల ఆధ్వర్యంలో టెంకాయలు, తమలపాకులు వేలం పాటలు నిర్వహించారు. రూ.10.55 లక్షలకు వేలంపాడి రవి అనే వ్యక్తి దక్కించుకున్నారని చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తలనీలాలతో పాటు కందిబేడలు, కొబ్బరి చిప్పలు వేలపాలం పాటలు ఈనెల 21వ తేదీ నిర్వహిస్తామన్నారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక

నందవరం : స్టేట్ టీచర్స్ యూనియన్ మండల నూతన కమిటీని గురువారం రాష్ట్ర కౌన్సిలర్ బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కాశయ్య, అధ్యక్షుడిగా బుట్టా శంకర్, ప్రధాన కార్యదర్శిగా కె.రాముడు, ఆర్థిక కార్యదర్శిగా సోమేష్, కౌన్సిల్ సభ్యులుగా మరో ఐదుగురిని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవ ప్రసన్నరాజు, జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కృష్ణగిరి: మండలంలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామస్వామి తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులకు యాత్రకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును గ్రామస్తులకు వివరించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. గ్రామస్థాయిలో సర్పంచ్‌తోపాటు అన్ని శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారన్నారు. 9వ తేదీన అమకతాడు, కంబాలపాడు, 10న కృష్ణగిరి, ఎరుకలచెరువు, 11న పోతుగల్లు, ఆగవేలి, 12న చుంచుఎర్రగుడి, లక్కసాగరం, 13న కోయిలకొండ, చిట్యాల, 14న కటారుకొండ, బోయబొంతిరాళ్ల, 15వ తేదీన ఎస్‌హెచ్ ఎర్రగుడి, ఆలంకొండ గ్రామాల్లో ఈ యాత్రలు ఉంటాయని ఆయన వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

చిప్పగిరి: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కుందన గుర్తి గ్రామానికి చెందిన కేసరి నారాంజనేయులు (28) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. గుంతకల్లు పట్టణంలోని ఆంజనేయ స్వామి కూడలిలో గత మంగళవారం కడప ప్రాంతానికి చెందిన మస్తాన్ ద్విచక్ర వాహనం, కేసరి నారాంజనేయులు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన కేసరి నారాంజనేయలును మొదట అనంతపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య రాణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

ఎమ్మిగనూరుటౌన్: పేద బడుగు బలహీన వర్గాలకు ప్రస్తుతం మంజూరవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం వుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 12వ వార్డు సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును జేసీఎస్ పట్టణ కన్వీనర్ షబ్బీర్‌అహమ్మద్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికే వర్తించేవన్నారు. అయితే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా గుర్తించి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు శివప్రసాద్, వార్డు ఇన్‌చార్జ్ షాబుద్దీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేఎస్ రఘు,



జూటూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలి

గోనెగండ్ల : పేదల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని సర్పంచ్ కృష్ణావేణి, జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.23.57కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోమే, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, మద్దయ్య, భానుప్రతాప్ రెడ్డి, యుగంధర్ నాయుడు పాల్గొన్నారు.

పి.కోటకొండలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని, ఏపీకి జగన్ ఎందుకు కావాలన్న దానిపై ప్రజలకు తెలియజేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున అన్నారు. గురువారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామంలో రూ.24.5 కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీదేవి, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, హనుమంతరెడ్డి, లుముంబా పాల్గొన్నారు.



పి.కోటకొండలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నవరత్నాలతో పేదలకు మేలు

నందవరం : నవరత్నాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఎంతో మేలు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సోమలగూడూరు సచివాలయం-2లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు విరుపాక్షిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చాంద్ బాషా, నాయకులు ప్రకాష్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ఎంపీటీసీ మాదమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పత్తికొండ రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ నారాయణదాస్ తెలిపారు. మండల పరిధిలోని జూటూరు గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు వర్తించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండగిరి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, సోమశేఖర్, భాస్కర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుల్లగుమ్మిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో ఎంపీటీసీ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో సెక్రటరీ ఫాతిమా ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పుల్లగుమ్మి గ్రామానికి సంబంధించి ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ పథకాల ద్వారా దాదాపు రూ.24 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎంపీటీసీ, పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గత, ప్రస్తుత ప్రభుత్వ తేడాలను వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, అచ్యుతానందరెడ్డి, శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన దృశ్యం

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

• ఆర్డీఓ రామలక్ష్మి

కృష్ణగిరి: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని 15 గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇబ్బందులు కలిగే పోలింగ్ స్టేషన్లను అదే గ్రామంలో సౌకర్యంగా ఉండే ప్రదేశానికి మార్చేందుకు నివేదికలు పంపుతామన్నారు. రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటు వేసే గ్రామాల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రణాళికలు తయారుచేసి ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నామని చెప్పారు. మండలంలో ఇది వరకు 40పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇప్పుడు రెండు కిలోమీటర్లు వెళ్లి ఓటుహక్కు వేసే గ్రామాల్లో మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెల 9 వరకు 18ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రాజేశ్వరి, సర్వేయర్ వెంకటసుబ్బయ్య ఉన్నారు.



కృష్ణగిరిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వినికిడి, దృష్టిలోపం దివ్యాంగ విద్యార్థులకు సులువుగా విద్య అభ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం స్థానిక ఎంఆర్‌సీలో మండలంలోని 8మంది విద్యార్థులకు ఎంఈఓ-2 రమేష్ చేతుల మీదుగా రూ.1,20,000 విలువగల ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న భవిత కేంద్రంలో ముగ్గురు, రామళ్లకోట, వెల్దుర్తి హరిజనవాడ మెయిన్‌స్కూల్, వెల్దుర్తి బాయ్స్ హైస్కూల్‌లో ఒక్కొక్కరు, పుల్లగుమ్మి హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని విద్యార్థులను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు అరుణ, స్వరూపారాణి, బాలుర హైస్కూల్ ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయుడు నరసింహులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



వెల్దుర్తి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎంఈఓ రమేశ్

నేమకల్లులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రధాన కూడలి నుంచి రాంపురం వీధి వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు రోడ్డు చదును పనులు చేపట్టారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి రోడ్డు సమస్యను గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రంగ స్వామి, మౌలా, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు చదును చేస్తున్న దృశ్యం

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక పూజలు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూ సి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రేపు దొడ్జెబాల్ ఎంపిక పోటీలు

ఆదోని సెంట్రల్: జాతీయస్థాయిలో జరిగే దొడ్జెబాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్, జూనియర్స్ జట్లకు సంబంధించి ఈ నెల 9వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహిస్తామ ని రాష్ట్ర దొడ్జెబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబిరెడ్డి, కార్యదర్శి సాబీర్ అహ్మద్ గురు వారం తెలిపారు. ఈ పోటీలు హర్యానా రాష్ట్రంలో జనవరి 5 నుంచి7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనదలచిన వారు 2007 జనవరి తరువాత జన్మించిన వారై ఉండాలని, జూనియర్స్ విభాగంలో పాల్గొనే వారు 2005 జనవరి తరువాత జన్మించి ఉండాలని చెప్పారు. ఎంపిక పాఠశాల స్కూల్ ఆవరణ (విజయలక్ష్మీ నర్సింగ్ హోమ్) దగ్గర ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు 9న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 7013563203 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హుండీ సొమ్ము చోరీ

కోసిగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుటనున్న సత్యమ్మవ్వ దేవాలయంలోని హుండీలోని సొమ్మును గుర్తు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భక్తులు కానుకలు సమర్పించేందుకు ఆలయం ఎదుట హుండీ ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ఆవరణలోనున్న మంచి నీటి బోరు నుంచి నీటిని పట్టుకునే వారు బిందెకు రూ.5ప్రకారం హుండీలో వేస్తారు. మూడు నెలలుగా హుండీని తెరవలేదు. అందులో రూ.10వేల వరకు ఉంటుందని భక్తులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ తాళం పగులగొట్టి నగదును అపహరించుకెళ్లారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



ఆదోనిఅర్బన్: స్థానిక ఎస్‌కేడీ కాలనీలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పంచామృతాభిషేకం, 18 మెట్లకు ప్రత్యేక అలంకరణతో పడిపూజ చేశారు. భక్తి గీతాల ఆలాపన, భజనల చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీఎం వైఎస్ జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

• ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
• ఎమ్మిగనూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని 16వ వార్డులో రెండో రోజు వార్డు కౌన్సిలర్ వాహిద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మళీ జగనన్న సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హుల ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాల మంజూరు నుంచి పంపిణీ వరకు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎక్కడ దళారివ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు సంక్షేమ పథకాలకు సంబంధించిన ఆర్థిక సహాయం జమ చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి వచ్చే ఎన్నికల్లో సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్ అహమ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు షబ్బీర్ అహమ్మద్, బంగిశ్రీరాం, వార్డు కౌన్సిలర్లు ఇషాక్, అమాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

అర్హతే ప్రామాణికం

గోనెగండ్ల : కులం, మతం, పార్టీలు చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బి. అగ్రహారం గ్రామంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలిసి రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధిగురించి వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో గ్రామంలో దాదాపు రూ. కోటితో సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, నాగిరెడ్డి, మన్సూర్, గిరిశ్వరరెడ్డి, బందెనవాజ్, నాగభూషణం, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలి

మద్దికెర : వాతావరణంలో మార్పుల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి రాగిణి సూచించారు. గురువారం స్థానిక వైద్యశాలలో వైద్యసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి 0-5 చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, న్యూమోనియాపై సర్వే నిర్వహిస్తారన్నారు. ఎవరికైనా దగ్గు, జలుబు, ఆయాసం ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల : ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్ కోరారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో తాలూకా కన్వీనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా గోవర్దన్ నాయుడు, సీపీఎస్ కన్వీనర్‌గా సోమనాథ్‌గౌడ్, మహిళ కన్వీనర్‌గా విజయలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

డిజిటల్ లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. లైబ్రరీ పోస్టులకై శిక్షణ పొంది ఆయా పోస్టుల కోసం వేలాది మంది ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంత్‌కుమార్, సోమిరెడ్డి, అజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఆస్పరి: ఈనెల 18, 19 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించే రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి, రంగన్న, నారాయణ, అంజినయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆస్పరిలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. మహా సభలలో రైతుల సమస్యలను చర్చించునున్నట్లు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

• సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

కృష్ణగిరి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని పెనుమాడ, కంబాలపాడు, గుడెంపాడు, బాపనదొడ్డి గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎస్ఐ సురేష్‌తో కలిసి సీఐ పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించమన్నారు. ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించినప్పుడే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ ఉందని, పంతాలు, పట్టింపులకు పోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.



పెనుమాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఆలూరు రూరల్: ప్రజల మెరుగైన ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యమని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. గురువారం ఆమె సిబ్బందితో కలిసి ఆలూరులోని సచివాలయం-4 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగుల ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వృద్ధులు,గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వారంలో రెండు సార్లు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు. 58 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ,షుగర్ వంటి తదితర పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

పశువుల హెల్త్ కార్డులపై అవగాహన కల్పించండి

ఆలూరు: పశువులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పశు ఆరోగ్య సంరక్షణ కార్డులపై పశుపోషకులకు, రైతులకు అవగాహన కల్పించాలని ఆలూరు పశు సంవర్ధక శాఖ సహ సంచాలకులు డాక్టర్ సి.విక్టర్‌బాబు ఆదేశించారు. గురువారం సచివాలయ వీఏలు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పశువులు, గొర్రెలు, మేకుల పెంకందార్లు దాదాపు 7 వేల మంది వరకు గుర్తించామన్నారు.

9న డీటీఎఫ్ ధర్నా

హొలహర్వి: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మజహర్ బాషా, మండలాధ్యక్షులు మస్తాన్‌వలి తెలిపారు. గురువారం వారు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని హొలహర్విలో విడుదల చేశారు. మజహర్‌బాషా మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండిగ్‌లో ఉన్న 25 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో హొలహర్వి మండల నాయకులు మస్తాన్‌వలి, మండల కార్యదర్శి రమేష్, సభ్యులు మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

ఆలూరు రూరల్: ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో ఔట్ సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్‌తో పాటు వార్డన్లకు 24 గంటల విధుల నుంచి మినహాయించాలని ఏపీ మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ వార్డన్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుధారాణి కోరారు. గురువారం స్థానిక మోడల్ హాస్టల్ ఆవరణలో ముఖ్యమంత్రికి తమ డిమాండ్లను పోస్టు కార్డులో రాసి పోస్టు చేశారు. డైలీ వేజెస్ విధానంలో ఉన్న కార్మికులకు ఔట్‌సోర్సింగ్ విధానంలోకి తీసుకోరావాలని కోరారు. యూనియన్ నాయకులు సరస్వతి, లక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన బడేసాబ్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి గురువారం తెలిపారు. బడేసాబ్ తన ఇంటి వద్ద ఓసీ 90 ఎం.ఎల్. పరిమాణం గల టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని నుంచి 123 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.